ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
గురువారం 4 జనవరి 2024



9న దివ్యాంగులకు జాబ్‌మేళా

పార్వతీపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో ఈ నెల 9న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు నిరుద్యోగ దివ్యాంగులు పాల్గొనొచ్చని పేర్కొన్నారు. ముందస్తుగా స్కిల్ యూనివర్స్‌ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. రిఫరెన్స్ నెంబర్‌తో పాటు సదరం సర్టిఫికెట్, రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల ఒరిజనల్, జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 79972 99739 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి భారీగా చేరికలు

- సీతానగరం నుంచి నలుగురు వైసీపీ సర్పంచ్‌లు, వారి అనుచరులు
- అదే దారిలో కౌన్సిలర్, మాజీ సర్పంచ్‌లు తదితరులు



టీడీపీలో చేరిన ఎల్ఎన్‌పురానికి చెందిన కె.శ్రీనివాసరావుకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

పార్వతీపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో పార్టీలోకి భారీగా వైసీపీ నేతలు, కార్యకర్తలు, కౌన్సిలర్, సర్పంచ్‌లు చేరారు. వారందరికీ పసుపు కండువా కప్పి పార్టీలోకి చంద్రబాబు ఆహ్వానించారు. టీడీపీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో వారంతా ప్రత్యేక బస్సులో బుధవారం మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. తొలుత విజయచంద్ర వారందర్నీ చంద్రబాబుకు పరిచయం చేశారు. అనంతరం సీతానగరం మండలం గాదిలవలస, దయానిధిపురం, పెదఅంకలం, చిన్న అంకలం గ్రామాల వైసీపీ సర్పంచ్‌లు భోగి శంకరరావు, టెంటు రామారావు, బలగా శ్రీనివాసరావు, తిరుపతిరావులు వారి అనుచరులతో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పటికే పార్టీలో చేరిన బక్కుపేట సర్పంచ్ గొట్టాపు మంగమ్మ ఆమె భర్త అప్పారావు, బూర్జ మాజీ సర్పంచ్ నీరస జ్యోతి, పార్వతీపురం ఒకటో వార్డు వైసీపీ కౌన్సిలర్ రణబేరి బంగారు నాయుడు, మూడో వార్డు వైసీపీ నాయకుడు శిఖరం భాస్కరరావు, తొమ్మిదో వార్డు మాజీ కౌన్సిలర్ కోల శ్రీనివాసరావు, 12, 29 వ వార్డుల వైసీపీ నేతలు గ్రంధి రామారావు, మురళీ పండ, పార్వతీపురం మండలం ఎల్ఎన్‌పురం నుంచి కొత్తాడ శ్రీనివాసరావు, ఎం.ఆర్.నగరం నుంచి నగిరెడ్డి అప్పల నాయుడు, పెద్దబండపల్లి నుంచి బొంతాడ లక్ష్మి, ఇరిగేషన్ మాజీ చైర్మన్ పోల పరశురాం, గాదిలవలస మాజీ సర్పంచ్ చుక్క వేణుగోపాల్ తదితరులు టీడీపీ సభ్యత్వం స్వీకరించారు. వీరందరికీ చంద్రబాబు నాయుడు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయచంద్రతో పాటు కొత్తగా పార్టీలో చేరిన వారిని, సీతానగరం మండల పార్టీ నేత సత్యనారాయణను చంద్రబాబు అభినందించారు. పార్వతీపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి చేయాలని సూచించారు. పార్టీని గెలిపించాలని కోరారు. ప్రతి ఒక్కరికి పార్టీలో గౌరవమైన స్థానం ఉంటుందని తెలిపారు.



టీడీపీలో చేరిన వారితో టీడీపీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి విజయచంద్ర

నేడు జిల్లాకు నారా భువనేశ్వరి

- తొలిసారి 'మన్యం'కు రాక
- ఏర్పాట్లలో టీడీపీ శ్రేణులు
- విజయవంతానికి పిలుపు



బిల్లుమడలో ఏర్పాట్లపై నాయకులతో చర్చిస్తున్న జయకృష్ణ

పార్వతీ పురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి గురువారం జిల్లాకు రానున్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా ఆమె తొలిసారి 'మన్యం'కు వస్తుండడంతో శ్రేణులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్దఎత్తున స్వాగతం చెప్పేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధమవుతున్నారు. ఇటీవల చంద్రబాబు అరెస్టుతో మనస్తాపానికి గురై మృతిచెందిన వారి కుటుంబాలను ఆమె పరామర్శించనున్నారు. ఇందులో భాగంగానే ఆమె జిల్లాలోని పాలకొండ నియోజకవర్గం భామిని మండలం బిల్లుమడలో విశ్వనాథం కుటుంబాన్ని ఓదార్చనున్నారు. కాగా ఇప్పటికే టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి జయకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆమె పాలకొండ చేరుకొని అక్కడి నుంచి భామిని వెళ్లనున్నారు. టీడీపీ ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనున్నారు.



విజయవంతం చేయాలి..

పాలకొండ/భామిని: భామిని మండలం బిల్లుమడ గ్రామంలో గురువారం నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ, నియోజకవర్గ పరిశీలకులు కలమట సాగర్ పిలుపునిచ్చారు. బుధవారం వారు పాలకొండలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గానికి నారా భువనేశ్వరి వస్తున్నట్లు తెలిపారు. టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని కోరారు. తొలుత ఆమె పాలకొండలోని కోటదుర్గమ్మను దర్శించుకొని సీతంపేట, కొత్తూరు మీదుగా భామిని మండలంలో పర్యటిస్తారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు కర్నేన అప్పలనాయుడు, గంటా సంతోష్ కుమార్, సుంకరి అనీల్‌దత్, అంపోలు శ్రీనివాసరావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ సాయంత్రం బిల్లుమడకు చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక నేతలతో చర్చించి సలహా సూచనలు అందించారు. ఆయన వెంట నేతలు జగదీశ్వరరావు, ఆనందరావు, కాశీ, రామరాజు ఉన్నారు.

ఉద్యమ హోరు

- కదం తొక్కిన అంగన్‌వాడీలు
- పార్వతీపురంలో భారీ ర్యాలీ
- కలెక్టరేట్ ముట్టడికి యత్నం.. అడ్డుకున్న పోలీసులు
- అక్కడే బైఠాయించి నిరసన
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు



పార్వతీపురంలో భారీ ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు



డిప్యూటీ సీఎం రాజన్న దొర కారును అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న దృశ్యం



కలెక్టరేట్ వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

బెలగాం, జనవరి 3: తమ సమస్యలపై సర్కారు స్పందించకపోవడంతో అంగన్‌వాడీలు సమ్మెను ఉధృతం చేశారు. నిరసన స్వరం పెంచారు. డిమాండ్లు నెరవేర్చాలని కదంతొక్కారు. బుధవారం జిల్లాకేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ముట్టడికి ప్రయత్నించగా అప్పటికే అక్కడికి భారీగా చేరుకున్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో కలెక్టరేట్ మెయిన్ గేట్ ముందు అంగన్‌వాడీలు బైఠాయించి నిరసన తెలిపారు. వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన అంగన్‌వాడీలు సాయంత్రం వరకు కలెక్టరేట్ వద్ద కూర్చొని.. 'జగనన్న ఇదేమి పాలన అన్నా' అంటూ ఆలపించారు. గత 23 రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా పట్టించుకోని ప్రభుత్వం.. నోటీసులతో తమను భయపెట్టాలని చూడడం దారుణమన్నారు. ఈ నెల 5లోగా విధులకు హాజరవ్వాలని ఆదేశాలివ్వడం దుర్మార్గపు చర్య అని అన్నారు. గతంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేవరకు సమ్మె విరమించేది లేదని వారు స్పష్టంచేశారు. తమ సమస్యలపై సర్కారు స్పందించకుంటే సీఎం ఇంటి వద్ద సమ్మె చేస్తామని అంగన్‌వాడీల సంఘం నాయకులు హెచ్చరించారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని ప్రధాన రహదారిపై ధర్నా చేయడంతో పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ కృష్ణారావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం కాన్వాయ్ అడ్డుకునే యత్నం..

పింఛన్ల పంపిణీ కార్యక్రమం ముగించుకుని తిరిగి తన నివాసానికి బయల్దేరిన డిప్యూటీ సీఎం రాజన్నదొర కాన్వాయ్‌ను మార్గమధ్యంలో అంగన్‌వాడీలు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అయితే వాహనాలు ఆపకపోవడంతో కాన్వాయ్ వెంట వారు పరుగులు తీశారు. ఇంతలో పోలీసులు అప్రమత్తమై.. అంగన్‌వాడీలను పక్కకు తప్పించారు. దీనిపై అంగన్‌వాడీలు ఆగ్రహించారు. తమ సమస్యలు విన్నవించడానికి వెళ్తే డిప్యూటీ సీఎం రాజన్నదొర కారు ఆపకుండా వెళ్లడంపై పెదవి విరిచారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు.

అభ్యంతరాలను పరిష్కరిస్తాం

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ముసాయిదా ఓటరు జాబితాలపై గతేడాది డిసెంబరు 9 వరకు వచ్చిన క్లయిమ్‌లు, అభ్యంతరాలను పరిష్కరిస్తామని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 1,91,793 ఫారాలు స్వీకరించగా, వాటిల్లో 1,83,195 ఫారాలు పరిష్కరించి ఓటరు జాబితాలో చేర్చినట్లు ఆయన తెలిపారు. 1,473 ఫారాలను ఆమోదించామని, 5,164 ఫారాలు తిరస్కరణకు గురయ్యాయని వెల్లడించారు. 1961 వినతులను పరిష్కరించాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో జె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించే సమావేశానికి అవసరమైన సమాచారం సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 9, 10 తేదీల్లో కేంద్ర ఎన్నికల సంఘం విజయవాడలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమీక్షించనుందని ఆయన తెలిపారు.



పాలకొండలో వంటా-వార్పు చేస్తున్న పారిశుధ్య కార్మికులు



సాలూరు: ప్రభుత్వం తీరుకు దండం పెడుతున్న మున్సిపల్ కార్మికులు

సర్కారు స్పందించకుంటే.. సమ్మె ఉధృతం

- నినదించిన పారిశుధ్య కార్మికులు

పార్వతీపురం టౌన్/సాలూరు/పాలకొండ, జనవరి 3: తమ డిమాండ్లపై సర్కారు స్పందించకుంటే సమ్మె ఉధృతం చేస్తామని పారిశుధ్య కార్మికులు తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు ఇంజనీరింగ్ విభాగం కార్మికులతో కలిసి పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. గత ఎన్నికల సమయంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని వారు నినాదాలు చేశారు. తమ సమస్యలపై సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. సాలూరులో పర్మినెంట్ కార్మికులతో రాత్రి ఏడు గంటల వరకు పని చేయించడాన్ని కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు ఖండించారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం ముఖద్వారం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. సమ్మెలో భాగంగా ప్రైవేట్ ట్రాక్టర్లును అడ్డుకున్నారు. శిబిరం వద్ద కార్మికులు పడుకోని ప్రభుత్వానికి దండం పెడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు.

మున్సిపల్ కార్మికులతో వాగ్వాదం..

పాలకొండ నగర పంచాయతీ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కార్మికులతో పాలకొండ కమిషనర్ సర్వేశ్వరరావు, వైస్ చైర్మన్ హనుమంతరావు తదితరులు వాగ్వాదానికి దిగారు. పోటీ కార్మికులతో పనిచేయడానికి ప్రయత్నించగా కార్మికులందరూ తిప్పికొట్టారు. పోలీస్ యంత్రాంగం సహాయంతో పనులు చేయిస్తామని బెదిరించడాన్ని తీవ్రంగా వారు ఖండించారు.

చివరకు నిరాశే..



- కొందరికే నూతన పింఛన్లు
- దరఖాస్తులు వేలల్లో.. మంజూరు వందల్లో..
- అత్యధికులకు మొండిచేయి చూపిన సర్కారు

పార్వతీపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి)/ గరుగుబిల్లి: అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్నామని చెబుతున్న సర్కారు ప్రకటనలకే పరిమితమవుతోంది. ఆచరణలో భిన్నంగా వ్యవహరిస్తోంది. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అత్యధికులకు మొండి చేయి చూపింది. నిబంధనల పేరిట కోత విధించింది. వేలల్లో దరఖాస్తులు రాగా వందల సంఖ్యలోనే నూతన పింఛన్లు మంజూరు చేసింది. పెంచిన పింఛన్ అర్హులందరికీ అందిస్తామన్న సర్కారు.. ఈ విధంగా వ్యవహరించడంపై జిల్లావాసులు మండిపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

గతంలో పింఛను రూ. 2,740 అందించేవారు. ఈ ఏడాది జనవరి నుంచి పాత పింఛన్‌కు అందిస్తున్న మొత్తానికి అదనంగా రూ. 250 కలిపి మొత్తంపై రూ. 3వేలు అందించనున్నామని ప్రకటించారు. కాగా జిల్లాకు సంబంధించి వివిధ రకాల పింఛన్లు 1,44,378 వరకు ఉన్నాయి. వాటి కోసం గతంలో సుమారు రూ. 40 కోట్లు విడుదల చేసేవారు. తాజాగా ఈ నెలలో ఆ మొత్తానికి అదనంగా రూ. 250 చొప్పున రూ. 3.58 కోట్లు ఇవ్వాల్సి ఉంది. మొత్తంగా సుమారు రూ. 43.09 కోట్లు అందించాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత నెలకు రూ.3 వేలు పింఛన్ అందిస్తామని చెబుతూ వచ్చింది. ప్రభుత్వం ఏర్పడిన రెండో సంవత్సరం ప్రారంభం నుంచి రూ.250 పెంచుతూ చివరకు ఈ నెలలో ఎన్నికలకు ముందు రూ.3వేలు అందిస్తున్నట్టు ప్రకటించింది. ఇదిలా ఉండగా చివరి సంవత్సరంలోనైనా పూర్తిస్థాయిలో దరఖాస్తులను పరిశీలించని పరిస్థితి నెలకొంది. నూతన పింఛన్ల కోసం జిల్లాలో సుమారు 9 వేలకు పైగా దరఖాస్తులు రాగా అందులో 2,683 మందికి మాత్రమే పింఛన్లు మంజూరు చేశారు.

కొన్ని మండలాల్లో ఇలా ...

పాలకొండ మండలంలో 206 మంది దరఖాస్తు చేసుకోగా 195 దరఖాస్తులు పరిశీలించి కేవలం 88 మందికి మాత్రమే పింఛన్లు మంజూరు చేశారు. పార్వతీపురంలో 796 మంది దరఖాస్తులకు గాను 324 దరఖాస్తులు పరిశీలించి.. 183 మందికి మాత్రమే అర్హులుగా తేల్చారు. కొమరాడలో 447 దరఖాస్తులు రాగా 138 మందికి, మక్కువలో 345 దరఖాస్తులకు గాను 188 పరిశీలించి 97 పింఛన్లను మంజూరు చేశారు. గుమ్మలక్ష్మీపురంలో 239 దరఖాస్తులు రాగా కేవలం 84 మందికి, సాలూరులో 286 దరఖాస్తులకు గాను 116 పరిశీలించి 97 మందికి, సీతంపేటలో 197 దరఖాస్తులు రాగా 92 మందికి, కురుపాంలో 239 దరఖాస్తులకు గాను 74 మందిని మాత్రమే పింఛన్లకు అర్హులుగా గుర్తించారు. ఇదిలా ఉండగా ఈ నెలలో పింఛన్ మొత్తం పెంచడంతో మూడో తేదీకి లాంఛనంగా ప్రారంభించారు. కాగా పూర్తిస్థాయిలో పింఛన్ల పంపిణీ ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

పంపిణీ షెడ్యూల్ ఇదీ..

కురుపాం, మక్కువ, బలిజిపేటలో ఈ నెల 4న, సాలూరు అర్బన్, సీతానగరం, జియ్యమ్మవలసలో 5న, పార్వతీపురం, పాచిపెంట, గుమ్మలక్ష్మీపురంలో 6న, సాలూరు మండలం, కొమరాడలో 7న, గరుగుబిల్లిలో 8న, పార్వతీపురం అర్బన్‌లో 3న పింఛన్ల పంపిణీకి అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. ఆ షెడ్యూల్‌కు రెండు రోజుల ముందు పింఛన్ సొమ్ము జమ చేయనున్నట్లు సమాచారం. నిధుల సమస్య కారణంగానే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఉద్యోగ భద్రత కల్పించాల్సిందే..

- మోకాళ్లపై కూర్చొని ఎస్ఎస్ఏ ఉద్యోగుల ఆందోళన

బెలగాం, జనవరి 3: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు నినదించారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని, తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద శిబిరంలో మోకాళ్లపై కూర్చొని వినూత్నంగా నిరసన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు కూడా వారితో పాటుగా మోకాళ్లపై కూర్చొని సంఘీభావం తెలిపారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు అండగా ఉంటామని, టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారి న్యాయమైన డిమాండ్లు నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్ర సమయంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు సమ్మె కొనసాగిస్తామని ఎస్ఎస్ఏ ఉద్యోగులు తెలిపారు. అనంతరం వారు ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఏవోకు వినతిపత్రం ఇచ్చారు.



మోకాళ్లపై కూర్చొని ఎస్ఎస్ఏ ఉద్యోగులతో పాటు నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

బకాయిలు చెల్లించండి

- యూటీఎఫ్ ఆధ్వర్యంలో టీచర్ల నిరసన

పార్వతీపురంటౌన్/ బెలగాం, జనవరి 3: వైసీపీ ప్రభుత్వం తక్షణమే ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని డీఈవో కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు టీచర్లతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 18 వేల కోట్ల మేర రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించాల్సి ఉందన్నారు. పిల్లల చదువులు, వివాహాలు తదితర అవసరాలకోసం దాచుకున్న డబ్బులను ఇవ్వమంటే ప్రభుత్వం స్పందించడం లేదని తెలిపారు. తమ డబ్బును వేరే అవసరాల కోసం దారి మళ్లించే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. సీఎం జగన్ మాట తప్పి.. మడం తిప్పడం వల్లే వివిధ శాఖల ఉద్యోగులు రోడ్డెక్కుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇలాంటి ఇబ్బందులకు గురిచేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9, 10న 36 గంటల ధర్నా విజయవాడలో చేపడుతున్నట్టు తెలిపారు. అనంతరం జేఏసీ చైర్మన్ జి.కిషోర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో ఉపాధ్యాయులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు

భువనేశ్వరికి ఘన స్వాగతం

● వాడవాడలా బారులు తీరిన అభిమానులు ● ప్రత్యేకంగా కలిసిన జిల్లా నాయకులు



రాజాం: హారతులు పట్టుకొని నిరీక్షిస్తున్న మహిళలు



బాడంగి: భువనేశ్వరికి స్వాగతం పలికేందుకు వచ్చిన నాయకులు

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు అనంతరం మరణించిన కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు నిర్వహించిన 'నిజం గెలిచింది' కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లాకు వచ్చిన నారా భువనేశ్వరికి అభిమానులు, కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆమె రాకకోసం ఎదురు చూసిన వారంతా నినాదాలతో హోరెత్తించారు. మహిళలు హారతులిచ్చారు.

-ఆంధ్రజ్యోతి బృందం



స్వాగతం పలుకుతున్న మీసాల గీత, కేఏ నాయుడు



పుష్పగుచ్ఛం ఇస్తున్న సువ్వాడ వనజాక్షి, రాజశేఖర్



మాట్లాడుతున్న కోండ్రు



స్వాగతం పలుకుతున్న సంధ్యారాణి, జగదీశ్వరి..



లలితకుమారి తదితరులు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

జామి జనవరి 3: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని కుమరాం ప్రభుత్వ పాఠశాల వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నంరాజుపేట గ్రామానికి చెందిన కంటుభుక్త లక్ష్మి(40) తన అల్లుడు, కూతురిని సంక్రాంతి పండగకు పిలిచేందుకు కుమారుడు సాయికుమార్‌తో బైక్‌పై మంగళవారం రాత్రి విజయనగరం వెళ్లింది. రాత్రి కుమార్తె ఇంటి వద్దనే ఉండి, పండగకు పిలుపుచేసి బుధవారం ఉదయం 8గంటలకు స్వగ్రామమైన అన్నంరాజుపేటకు రెండేళ్ల మనవడిని పట్టుకుని కుమారుడితో కలిసి బైక్‌పై బయలుదేరింది. అయితే కుమరాం పాఠశాల వద్దకు వచ్చేసరికి ఎదురుగా ఏడో తరగతి విద్యార్థి సైకిల్‌పై వస్తూ అడ్డు పడడంతో వాహనం నడుపుతున్న సాయికుమార్ కంగారుగా బ్రేక్ వేశాడు. దీంతో వెనుక కూర్చున్న లక్ష్మి రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే చనిపోయింది. సాయికుమార్, రెండేళ్ల బాలుడికి స్వల్పగాయాలయ్యాయి. పాఠశాల విద్యార్థికి స్వల్ప గాయం కావడంతో ఆసుపత్రికి తరలించారు. దీంతో గ్రామంలో విషాదం నిండుకుంది. మృతురాలి భర్త అప్పలసూరి తాపీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎస్ఐ వీరబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ప్రమాదంలో ఈవోపీఆర్‌డీ దుర్మరణం

జియ్యమ్మవలస/ఆమదాలవలస: జియ్యమ్మవలస ఈవోపీఆర్‌డీ ఎన్. మురళీరావు శ్రీకాకుళం జిల్లాలోని ఊసవానిపేట రైల్వేగేటు సమీపంలో గుర్తుతెలియని రైలు ఢీకొని దుర్మరణం పాలయ్యాడు. పలాస రైల్వే ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం గ్రామానికి చెందిన నానుపాత్రుని మురళీరావు(54) మంగళవారం రాత్రి ఊసవానిపేట రైల్వేగేటు సమీపంలో గుర్తుతెలియని రైలుఢీకొని మృతిచెందాడు. మురళీరావు వాకింగ్ చేస్తూ రైల్వే ట్రాక్ దాటుతున్న సమయంలో రైలు ఢీకొంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు. పోస్టుమార్టం నిమిత్తం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మురళీరావుకు భార్య కుమారితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా మురళీరావు మృతిపై ఎంపీపీ బొంగు సురేష్, ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సంతాపం తెలియజేశారు.

బెల్ట్ షాపులపై దాడి.. ఇద్దరిపై కేసు

వేపాడ: మండలంలోని కరకవలస, దబ్బిరాజుపేట గ్రామాల్లో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసినట్టు వల్లంపూడి ఎస్ఐ రాజేష్ బుధవారం తెలిపారు. కరకవలసలో 13, దబ్బిరాజుపేటలో 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

రెండెకరాల ధాన్యం కుప్ప దగ్ధం

రేగిడి: ఉణుకూరు గ్రామంలో మంగళవారం రాత్రి తెంటు కృష్ణమూర్తి అనే రైతుకు సంబంధించిన రెండెకరాల ధాన్యం కుప్ప దగ్ధమైంది. రూ.1.37 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్టు ఆర్ఐ రేవతి తెలిపారు. పక్కనే మరికొన్ని కుప్పలు ఉన్నా.. గ్రామస్థులు అప్రమత్తం కావడంతో పెద్దప్రమాదం తప్పింది. ధాన్యం మొత్తం బుగ్గి పాలవటంతో రైతు లబోదిబోమంటున్నాడు. ఆర్ఐ రేవతి, వీఆర్‌ఓ సత్యనారాయణలు నష్టాన్ని అంచనా వేశారు.

పూరిల్లు ..

రేగిడి: అంబఖండి గ్రామానికి చెందిన కుప్పలి సూర్యుడమ్మకు చెందిన పూరిల్లు మంగళవారం అర్ధరాత్రి దగ్ధమైంది. రూ.1.50 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్టు అంచనా. రాత్రి అందరూ గాఢనిద్రలో ఉన్న సమయంలో ఈ ఘటన చోటచేసుకొంది. మంటలను గుర్తించిన బాధితురాలు బయటకు రావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీపం ఒత్తిని ఎలుకలు ఇంటి పైకప్పు పైకి తీసుకువెళ్లడంతో ప్రమాదం సంభవించినట్టు బాధితురాలు చెబుతోంది. తిండిగింజలు, వంట పాత్రలు, రూ.30 వేల నగదు మంటల్లో ఆహుతైనట్టు ఆర్ఐ రేవతి వెల్లడించారు. తహసీల్దార్ సుదర్శనరావు ప్రమాద స్థలాన్ని సందర్శించి.. ప్రాథమి సాయాన్ని పంపిణీ చేశారు.

వివాహిత మృతి కేసులో లొంగిపోయిన భర్త

బాడంగి: తన భార్య వంగపండు అన్నపూర్ణను తానే బావిలో తోసేసినట్టు నిందితుడు రామారావు ఒప్పుకొని పోలీసులకు లొంగిపోయాడు. ఈ మేరకు బుధవారం స్థానిక స్టేషన్‌లో డీఎస్పీ శ్రీధర్ కేసు వివరాలను వెల్లడించారు. కోటిపల్లి గ్రామానికి చెందిన వంగపండు రామారావు మొదటి భార్యకు పిల్లలు లేరు. దీంతో అదే గ్రామానికి చెందిన అన్నపూర్ణను రామారావు రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెకు మూడేళ్ల కుమార్తె మౌనిక పుట్టిన తరువాత మరొక సంతానం కలిగి చనిపోయింది. తాజాగా అన్నపూర్ణ మూడో నెల గర్భిణి. అయితే తాను అబార్షన్ చేయించుకుంటానని రామారావుతో తరచూ గొడవపడేది. ఆ పనిచేయవద్దని రామారావు వారించేవాడు. ఈ విషయంపై పలుమార్లు వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో రామారావు విసిగిపోయాడు. చివరకు కొత్తచెరువు పొలం వద్దకు అన్నపూర్ణను తీసుకువెళ్లి అక్కడ బావిలో తోసేశాడు. నిందితుడిపై 302, 489 ఏ కేసులు నమోదు చేశామని, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ తిరుమలరావు, ఎస్ఐ సురేంద్రనాయుడు, ఏఎస్ఐ కొండలరావు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రేగిడి: సంకిలి గ్రామంలో మంగళవారం రాత్రి పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. సంకిలికి చెందిన నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. వీరి నుంచి రూ.6,999 నగదును స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వీరిని అరెస్టు చేసి... పూచీకత్తుపై విడిచిపెట్టినట్లు చెప్పారు.

340 లీటర్ల సారా స్వాధీనం

కురుపాం: మూలిగూడ జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, కురుపాం ఎస్ఐ షణ్ముఖరావు వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ మేరకు అక్రమంగా వాహనంలో సారా ట్యూబ్స్‌లో తరలిస్తున్న 340 లీటర్ల స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

సంక్షేమ పథకాలన్నీ కేంద్రానివే

లక్కవరపుకోట: రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ కేంద్ర ప్రభుత్వానివేనని బీజేపీ సీనియర్ నాయకుడు వడ్లమాని శేషావతారం తెలిపారు. బుధవారం శ్రీరాంపురంలో జరిగిన వికసిత్ భారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర పథకాలకు రంగులేసి జగన్ ప్రచారం చేసుకుంటున్నాడని విమర్శించారు. మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉజ్వల, ఆయుష్మాన్ భారత్, ఉపాధిహామీ, ఉచిత రేషన్ వంటి పథకాలను వివరించారు.

పేదలకు అండగా ఉండడమే ధ్యేయం

వేపాడ: పాదయాత్రలో భాగంగా ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకొని పేద ప్రజలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ప్రజలు రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనువాసరావు అన్నారు. వేపాడ గ్రామ సచివాలయ ఆవరణలో పంచాయతీ విస్తరణ అధికారి ఉమా అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన నూతన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ధ్రువపత్రాల పంపిణీ

విజయనగరం రూరల్: నగర శివార్లలోని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో బుధవారం వైస్ ఛాన్సలర్ కె.వెంకట సుబ్బయ్య, రిజిస్ట్రార్ జి.జయసుమ 43 మంది విద్యార్థులకు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం సర్టిఫికెట్లు అందజేశారు. బోర్డు ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ జీజే నాగరాజు ఆధ్వర్యంలో ఈ ప్రోగ్రాం నిర్వహించారు. వివిధ పాఠశాలలకు వెళ్లి సాంకేతికత, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు.

పింఛన్ మూడు వేలకు పెంపు

కలెక్టరేట్: ఈనెల నుంచి లబ్ధిదారులకు పింఛన్‌ను మూడు వేల రూపాయలకు పెంచినట్లు జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. పెంచిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా సీఎం జగన్ కాకినాడలో పాల్గొన్నారు. లైవ్‌లో జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియం నుంచి కలెక్టర్ నాగలక్ష్మి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు, ఎంఎల్‌సీ రఘురాజు పాల్గొని సీఎం కార్యక్రమాన్ని వీక్షించారు. జిల్లా వ్యాప్తంగా 2,85,675 మంది లబ్ధిదారులకు రూ. 83.54 కోట్లు అందిస్తున్నామని జడ్పీ ఛైర్మన్ తెలిపారు.

జూదరుల అరెస్ట్

రాజాం రూరల్: మండల పరిధిలోని కంచరాం సమీపంలో పేకాడుతున్న ఐదుగురిని రాజాం పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 41600 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు.

నూతన కార్యవర్గం

రాజాం: స్థానిక బెరాకా బాపిస్టు చర్చిలో బుధవారం రాజాం మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా వి.ప్రభుకుమార్, అధ్యక్షులుగా కె .కుమార్‌రాజు, ఉపాధ్యక్షులుగా బి.విక్టర్‌పాల్, కార్యదర్శిగా కె.పాల్. సహాయ కార్యదర్శిగా పి.ఫెలిక్స్, కోశాధికారిగా ఆర్.ఎం.సామ్యూల్, సీనియర్ అడ్వయిజర్‌గా వై.మత్తయ్య, టి.కృపానందం, వి.డానియల్ తదితరులు ఎన్నికయ్యారు.

ఆరుతడి పంటలకే నీరు వాడాలి

వంగర: మడ్డువలస కాలువ నీరు ఆరు తడి పంటలకు వాడుకోవాలని డీఈఈ పి.అర్జున్ తెలిపారు. మడ్డువలస కుడి కాలువ ద్వారా బుధవారం రబీకి నీరు విడుదల చేసి మాట్లాడారు. ముందుగా కాలువ గేట్లకు ప్రత్యేక పూజలు చేసి నీరు విడుదల చేశారు. కాలువలో నీరు వస్తోందనే ఉద్దేశంతో ఎవరైనా వరి, ఇతర పంటలు వేస్తే నష్టపోతారన్నారు. నాలుగు మండలాల్లో కేవలం 13,500 ఎకరాలకు మాత్రమే రబీలో నీరు అందించగలుగుతామన్నారు. ఏఈఈలు అవినాష్, సూర్య, నితిన్, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

బిందు సేద్యం లాభదాయకం

శృంగవరపుకోట రూరల్: బిందు, తుంపర సేద్యం రైతులకు ఎంతో లాభదాయకమని ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం కొత్తూరు, శివరామ రాజుపేట, గోపాలపల్లి గ్రామాల్లో బిందు, తుంపర సేద్యాన్ని పరిశీలించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీదే విజయం



మాట్లాడుతున్న సుజయ్ కృష్ణ

రామభద్రపురం, జనవరి 3: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయఢంకా మోగిస్తుందని మాజీ మంత్రి, తెలుగుదేశం సీనియర్ నాయకుడు సుజయ్‌కృష్ణ రంగారావు అన్నారు. బూసాయవలసలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ముఖ్యంగా యువత ఉపాధి లేక అల్లాడిపోతోందని, కొత్త పరిశ్రమలు తెప్పించడంలో ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందన్నారు. చిరుద్యోగులు, భవన నిర్మాణ కార్మికులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అంగన్‌వాడీలు, చిరుద్యోగులకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో జగన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. మళ్లీ తెలుగుదేశం అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఎంతో అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటారని అన్నారు. జియ్యమ్మవలస మాజీ ఎంపీపీ దత్తి లక్ష్మణరావు, జనసేన నాయకుడు గిరడ అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం

కొత్తవలస: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా నిర్వహించారు. సమావేశానికి హాజరైన స్థానిక శాసన సభ్యుడు కడుబండి శ్రీనివాసరావు కొంత నిర్వేదంతో ఉపన్యాసాన్ని మొదలుపెట్టారు. వచ్చే సమావేశం నాటికి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేస్తుందన్నారు. శృంగవరపుకోట నియోజకవర్గం టిక్కెట్ తనకు వస్తుందో.. రాదో... వస్తే తాను గెలుస్తానో లేదో..మళ్లీ సమావేశంలో పాల్గొంటానో లేదో అనే విధంగా ఉపన్యాసాన్ని కొనసాగించారు. ఎమ్మెల్సీ రఘురాజు, కొప్పల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడుబాబు సమావేశానికి హాజరు కాకపోవడం అనుమానాలు కలిగించింది. కొన్ని ముఖ్యమైన శాఖలపై సమీక్ష నిర్వహించి.. సమావేశం జరిగిందనిపించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులతో పాటు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం పింఛను రూ.3 వేలకు పెంచిన సందర్భంగా కొత్తగా మంజూరైన వారికి అందజేయడానికి ఎమ్మెల్యే త్వరగా సమావేశాన్ని ముగించి వారందరినీ కింద ఏర్పాటు చేసిన సమావేశానికి తీసుకెళ్లారు. జడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, వైస్ ఎంపీపీ కర్రి శ్రీను, కొత్తవలస పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి జయప్రకాష్, ఎంపీడీవో వై.పద్మజ, తహసీల్దార్ శ్రీనివాస మిశ్రా హాజరయ్యారు.

ప్రాథమికోన్నత పాఠశాల తనిఖీ

రాజాం: గడిముడిదాం ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓలు పి.ప్రవీణ్ కుమార్, వి.దుర్గారావు బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి... రుచిగా వండాలని ఆదేశించారు. హెచ్ఎం అప్పలస్వామి, ఎండీఎం నిర్వాహకులు పద్మ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ వ్యవస్థను రక్షించుకుందాం



కదలిరండి వాహనాలను ప్రారంభిస్తున్న అదితి గజపతిరాజు

విజయనగరం (ఆంధ్రజ్యోతి), జనవరి 3: సర్పంచ్‌ల హక్కులు, విధులు, సమస్యల గురించి చర్చించే క్రమంలో ఏపీ పంచాయతీ చాంబర్, సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో 'కదిలిరండి.. పంచాయతీ వ్యవస్థను రక్షించుకుందాం' అనే కార్యక్రమం కోసం బుధవారం ఉదయం ఏడు గంటలకు విజయనగరం మండల పరిధిలోని సర్పంచ్‌లు, స్థానిక సంస్థల ప్రతినిధులు విజయవాడకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా గొల్లలపేట మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు ఈగల సత్యారావు మాట్లాడుతూ, హక్కుల కోసం జరిగే పోరాటాన్ని ప్రభుత్వం బలవంతంగా అడ్డుకుంటోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఈ పోరాటానికి మాజీ సీఎం చంద్రబాబు మద్దతు ప్రకటించారన్నారు. సర్పంచ్‌ల నిధులను అనధికారికంగా మళ్లించారన్నారు. ఈ కార్యక్రమం కోసం విజయనగరం నుంచి విజయవాడకు బయలుదేరిన వాహనాలకు విజయనగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, వేచలపు శ్రీను, రాజేష్‌వర్మతో పాటు పలువురు టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల హక్కులను కాపాడాలి



సమావేశంలో పాల్గొన్న ఎస్.కోట మండల టీడీపీ సర్పంచ్‌లు

లక్కవరపుకోట, జనవరి 3: రాష్ట్రంలో స్థానిక సంస్థల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ జెడ్పీటీసీ, టీడీపీ నేత కరెడ్ల ఈశ్వరరావు తెలిపారు. బుధవారం గుంటూరులో పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యాన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. లక్కవరపుకోట మండలం నుంచి తామరాపల్లి, తలారి, మార్లాపల్లి, లింగంపేట గ్రామ సర్పంచ్‌లతో పాటు ఆయన సమావేశానికి హాజరైనట్లు తెలిపారు. జగన్ హయాంలో స్థానిక సంస్థల నిర్వీర్యంపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మండి పడినట్లు తెలిపారు. రాష్ట్రంలో సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు, జెడ్పీటీసీలకు కనీస విలువ లేకుండా పోయిందని ఈశ్వరరావు తెలిపారు. ఈ సమావేశానికి వేలాది మంది స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు హాజరైనట్లు తెలిపారు. మండలం నుంచి యడ్ల పైడిరాజు, జి.సత్యం, ఎం.భాస్కరరావు, జి.ప్రసాద్ తదితరులు హాజరయ్యారని పేర్కొన్నారు.

ఉన్నోళ్లకే వైఎస్ఆర్ కాలనీలో ఇళ్లు

● స్థలాలు మంజూరు చేయకపోవడంతో గెడ్డల్లో పాకలు

● అధికారులతో ఆక్రమణదారుల వాగ్వాదం



ఎస్.కోట: గెడ్డ ఆక్రమణల వద్ద ఏర్పాటు చేసిన అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించకుండా అడ్డుకుంటున్న దృశ్యం

శృంగవరపుకోట, జనవరి 3: స్థానిక పందిరప్పన్న కూడలి సమీపంలో చెరకు కాటా భూమికి ఆనుకొని ఉన్న గెడ్డ పొడవునా ఆక్రమించి... కొందరు పాకలను నిర్మించారు. వీటి వద్ద అంబేడ్కర్ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం చెరకు కాటాకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించారని రైతులు భీమసింగి చక్కెర కర్మాగారం యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆక్రమణలను తొలగించాలని కోరుతూ యాజమాన్యం రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు తహసీల్దార్ డి.శ్రీనివాసరావు వీఆర్వోలు కన్నయ్య, నాయుడులను బుధవారం క్షేత్ర స్థాయికి జేసీబీతో పంపించారు. ఇద్దరు కానిస్టేబుళ్ల భద్రత కల్పించేందుకు వచ్చారు. పాకలను తొలగించేందుకు ఉపక్రమించడంతో ఆక్రమణదారులు అడ్డుకున్నారు. తొలగిస్తే ఎస్సీ ఎస్టీ కేసులు పెడతామని హెచ్చరించారు. చెరకు కాటా స్థలం కాదని... గెడ్డ స్థలంలో పాకలు నిర్మించామని వాదనకు దిగారు. ఇంతలో తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, ఎస్.ఐ లోవరాజులు ఆక్రమణదారులతో చర్చించారు. సర్వే చేసిన తరువాత చెరకు కాటాకు చెందిన స్థలమైతే వదిలేస్తామని అధికారులకు వివరించారు. గెడ్డ స్థలాన్ని ఆక్రమించడం చట్ట ప్రకారం నేరం కాబట్టి ఖాళీ చేయాలని తహసీల్దార్ సూచించారు. ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే చాలా దఫాలు దరఖాస్తులు ఇచ్చినా.. స్థలాలు ఇవ్వకపోవడంతో విధిలేని పరిస్థితిలో గెడ్డలో పాకలు వేశామని వారు బదులిచ్చారు. రేషన్ కార్డులు లేని వారికి స్థలాలు ఇవ్వలేకపోయామని రెవెన్యూ అధికారులు చెప్పగా... అందుకే గెడ్డ స్థలంలో నివశించేందుకు సిద్ధపడుతున్నామని చెప్పుకొచ్చారు. పేదల పాకలను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని... ఇదే గెడ్డలో నిర్మించిన భవనాల పరిస్థితేంటని నిలదీశారు. డబ్బున్నోళ్లకు ఓ న్యాయం... పేదలకు మరో న్యాయమా అంటూ ఘర్షణకు దిగారు. ప్రభుత్వ భూమి వద్ద అంబేద్కర్ ఫ్లెక్సీలను పెట్టడం నేరమని.. వాటిని తొలగించేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నించగా మహిళలు అడ్డుకున్నారు. మహిళలపై చేయి వేస్తున్నారంటూ రెవెన్యూ అధికారులతో గొడవకు దిగారు. ఎస్.ఐ లోవరాజును చూపిస్తూ ఆయన వద్దనే కేసులు పెడతామని బెదిరించారు. దీంతో అంబేద్కర్ ఫ్లెక్సీని కూడా అధికారులు తొలగించలేకపోయారు. చివరికి చేసేదేమీ లేక శుక్రవారం కార్యాలయానికి రావాలని వారితో చెప్పి తహసీల్దారు తిరుగుముఖం పట్టారు.

ప్రభుత్వ తీరు మారాలి

● కొనసాగిన మున్సిపల్ కార్మికుల నిరసన





రా జాంలో ర్యాలీ, బొబ్బిలిలో మానవహారం నిర్వహిస్తున్న కార్మికులు

రాజాం రూరల్, జనవరి 3: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం తన తీరు మార్చుకోవాలని, లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని సిటు జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు హెచ్చరించారు. బుధవారం రాత్రి ఇక్కడి మెయిన్‌రోడ్‌లో కార్మికులు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆయన పాల్గొని ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఎండగట్టారు.

బొబ్బిలి: మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు బుధవారం స్థానిక ఎన్టీఆర్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి తమ నిరసన తెలిపారు. సమానపనికి సమాన వేతనం ఇచ్చేందుకు ప్రభుత్వం ససేమిరా అనడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. సీఐటీయూ నాయకుడు పి.శంకరరావు నాయకత్వంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. ● ఈ నెల 4 నుంచి మున్సిపాలిటీలో వాటర్, లైటింగ్, కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్స్ కూడా సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొంటారని శంకరరావు తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ మేనేజరు శివ ప్రసాద్‌కు బుధవారం మెమోరాండం అందజేశారు. మజ్జి ఈశ్వరరావు, ప్రసాద్, మోహన్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పెదపోలమాంబ అంపకోత్సవం



అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

మక్కువ: శంబర పోలమాంబ జాతరలో భాగంగా పెద పోలమాంబ అమ్మ వారి అంపకోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత చదురు గుడి నుంచి అమ్మవారి ఘటాలను డప్పులు, వాయిద్యాలు మధ్య అర్ధరాత్రి వరకు గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఎస్.పెద్దవలస రహదారి సమీపంలోని గుడి వద్ద పెద పోలమాంబ ఘటాలను ఉంచారు. బుధవారం అక్కడే అమ్మవారికి అంపకోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దీంతో శంబర జాతరకు సందడి మొదలుకానుంది. ఈనెల 8న గోముఖి నదీ తీరంలో చినపోలమాంబను కొలిచి గ్రామానికి తీసుకొస్తారు. అప్పటి నుంచి చినపోలమాంబ చదురుగుడిలో కొలువై ఉంటారు. 22, 23, 24 తేదీల్లో శంబర పోలమాంబ అమ్మవారి జాతర జరగనుంది. కార్యక్రమంలో ఆలయ ఈవో సూర్యనారాయణ, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సావిత్రీబాయికి ఘన నివాళి



ఎస్.కోట రూరల్: ధర్మవరం పాఠశాలలో సావిత్రిబాయ్‌పూలే జయంతి

విజయనరం దాసన్నపేట, జనవరి 3: సామాజిక సంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతిని బుధవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉపాధ్యాయులకు స్ఫూర్తిప్రదాత అయిన పూలే సేవలను కొనియాడారు. విజయనగరంలో గుంటూరు విద్యా సంస్థల కళాశాల ప్రాంగణంలో పూలే జయంతిని నిర్వహించారు. డైరెక్టర్ బీపీ రావు, సీఏ మంగవేణి, ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, ఉమామహే శ్వరరావు, పైడిరాజు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ● కలెక్టరేట్ సమీపంలోని సావిత్రీబాయి పూలే విగ్రహం వద్ద ఉత్తరాంధ్ర అంబేడ్కర్ రైట్స్ నాయకులు గంటా వీర్రాజు, పాండ్రంకి రమణలు నివాళి అర్పించారు. ● జేవీవీ సమతా రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల ఆధ్వర్యంలో కస్పా హైస్కూల్‌లో పూలే జీవితంపై పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ● టీడీపీ నాయకుడు గదుల వెంకటరావు ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీపంలోని సావిత్రిబాయి విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో దిమిలి పైడిరాజు, పి.శ్రీనివాసరావు, ధనుష్ తదితరులు పాల్గొన్నారు. ● ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు ముద్దాడ మధు ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీపంలోని సావిత్రిబాయి విగ్రహం వద్ద నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు, మేయర్ వీవీ లక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

● **బాడంగి:** స్థానిక ఎన్ఎస్ఎస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని జరిపారు. ఆమె గొప్పతనం గురించి ప్రిన్సిపాల్ శంకరరావు తెలిపారు. అనంతరం కళాశాలలో ముగ్గురు మహిళా అధ్యాపకులను ఘనంగా సత్కరించారు.

● **లక్కవరపుకోట:** జమ్మాదేవిపేట వద్ద మహాత్మ జ్యోతి బాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో సావిత్రీబాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ యువీకే.పాత్రో ఆధ్వర్యంలో పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులతో సమావేశం, విద్యార్థులతో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

● **రాజాం రూరల్:** స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సావిత్రీబాయికి నివాళి అర్పించారు. పెనుబాక ప్రభుత్వ పాఠశాలలో టీచర్లు శ్రీలక్ష్మి, కామేశ్వరమ్మలను సన్మానించారు.

● **కొత్తవలస:** స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న సావిత్రీబాయి విగ్రహానికి రెవెన్యూ ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కంటకాపల్లి జడ్పీ హైస్కూల్‌లో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమాలలో తహసీల్దార్ శ్రీనివాస మిశ్రా, డీటీ రమేష్, కంటకాపల్లి హెచ్ఎం వి.అరుణ్‌కుమార్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలు దంతులూరి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

● **వేపాడ:** బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అందర్నీ అలరించారు.

● **శృంగవరపుకోట రూరల్ :** ధర్మవరం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఉమమహేశ్వరరావు ఆధ్వర్యంలో సావిత్రిబాయి జయంతిని నిర్వహించారు.

● **సాలూరు రూరల్:** శివరాంపురం పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్ ఆలమూరి ఉమామహేశ్వరరావు సావిత్రిబాయి జయంతిని జరిపారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● **బొబ్బిలి:** స్థానిక సంఘవీధిలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంబేడ్కర్ పోరాటసమితి అధ్యక్షుడు సోరు సాంబయ్య, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు. ● స్థానిక ఇందిరమ్మకాలనీలో సావిత్రీ బాయి విగ్రహానికి నివాళి అర్పించారు. సామాజిక కార్యకర్త ఆర్.జగదీశ్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో ఎంఈవో గొట్టాపు వాసు తదితరులు పాల్గొన్నారు. ● కోమటిపల్లి , నారసింహునిపేట హైస్కూళ్లలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.



లక్కవరపుకోట: పూలే వేషధారణలో విద్యార్థులు

● **పాలకొండ:** పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంబాబు , వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.రాజు, తెలుగు, కామర్స్ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఓరి ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ఇన్‌చార్జి హెచ్ఎం గోగుల సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్ దానేటి పుష్పలతను సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంట్లోకి జింక



సీతానగరం: పెదబోగిల హడ్కో కాలనీలో నివాసముంటున్న సాకేటి లక్ష్మి ఇంటిలోకి బుధవారం ఉదయం ఓ జింక ప్రవేశించింది. దీంతో ఆ కుటుంబ సభ్యులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. కొద్దిసేపు ఏం చేయాలో వారి తెలియలేదు. చివరకు జింక కాలుకు స్వల్ప గాయమైనట్లు గుర్తించి దానిని ఇంటిలోనే ఉంచారు. పార్వతీపురం అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. ఇంతలో జింకను చూసేందుకు స్థానికులు అక్కడకు ఎగబడ్డారు. అనంతరం ఫారెస్టు అధికారులు చేరుకుని జింకను పరిశీలించారు. చికిత్స కోసం దానిని పార్వతీపురం తరలించారు. గ్రామ సమీపంలో కొండ ప్రాంతం నుంచి జింక గ్రామంలోకి వచ్చినట్లుగా స్థానికులు భావిస్తున్నారు

పంట పొలాల్లో ఏనుగులు



కొమరాడ: గజరాజుల గుంపు పంట పొలాల్లో సంచరించడంతో రైతులు ఆందోళన చెందుతు న్నారు. బుధవారం కుమ్మరిగుంట గ్రామ సమీపంలోని వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. దీంతో రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఇప్పటికైనా అటవీశాఖాధికారులు స్పందించి ఈ ప్రాంతం నుంచి గజరాజులను తరలించే చర్యలు చేపట్టాలని, పంట నష్టపోయిన వారికి పరిహారం అందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గిరిజన సంక్షేమ శాఖ డీడీ బాధ్యతల స్వీకరణ

సీతంపేట: జిల్లా గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.అన్నదొర బుధవారం సీతంపేట డీడీ కార్యాలయంలో బాధ్యతలను చేపట్టారు. కార్యక్రమంలో ఏటీ డబ్ల్యూవో మంగవేణి, కార్యాలయ పర్యవేక్షకులు దేశ్ పాల్గొన్నారు. ● **పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:**పార్వతీపురం ఐటీడీఏగిరిజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా రుక్మా గండెయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా నుంచి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.ఇప్పటి వరకు ఇన్‌చార్జి డీడీగా పని చేసిన శ్రీనివాసరావు నుంచి బాధ్యతలు స్వీకరించారు.

ఏపీ ఎన్‌జీవో క్యాలెండర్ ఆవిష్కరణ

పార్వతీపురం ఆంధ్రజ్యోతి:ఏపీఎన్‌జీవో క్యాలెండర్‌ను కలెక్టర్ నిశాంత్‌కుమార్ బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీవో సంఘం నాయకులు జీవీఆర్.ఎస్.కిషోర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పెద్దూరు పాఠశాల పరిశీలన

సీతంపేట:పెద్దూరు పాఠశాలను ఎమ్మెల్యేకళావతి బుధవారం పరిశీలించారు. కార్యక్రమం ఉపాధ్యాయులు సవర ప్రసాద్, సత్యంనాయుడు పాల్గొన్నారు.

సరుకులు సకాలంలో పంపిణీ చేయాలి

పాలకొండ: లబ్ధిదారులకు సకాలంలో సరుకులు పంపిణీచేయాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు కోరారు. బుధవారం పాలకొండ నగర పంచాయతీలోని ఇందిరానగర్ కాలనీలో డీఎంయూ వాహనం ద్వారా రేషన్ పంపిణీని పరిశీలించారు. ఈసందర్భంగా వాహన నిర్వాహకులతో మాట్లాడారు. కార్యక్రమంలో వీఆర్వో బలివాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించండి

సీతంపేట: ఉపాధి వేతనదారులకు పది వారాలు బిల్లులు చెల్లించకపోతే ఏపీడీ కార్యాలయం ముట్టడిస్తామని ఆదివాసీ గిరిజన సంఘం మండలాధ్యక్షుడు జె.శ్రీరాములు, కార్యదర్శి బి.సాయి తెలిపారు.బుధవారం సీతంపేటలో విలేకరులతో మాట్లాడుతూ క్రిస్మస్, సంక్రాంతి నిర్వహణకు, ఇంటి అవసరాలకు డబ్బులు లేక గిరిజన కూలీలు ఇబ్బందిపడుతున్నా అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఐటీడీఏ పీవో, ఎంపీడీవో జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు.కార్యక్రమంలో పి.సాయి పాల్గొన్నారు.

13 మందిపై బైండోవర్ కేసులు

సీతంపేట: దోనుబాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో 13 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి బుధవారం తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు. సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో ముందస్తుగా బైండోవర్ కేసులు నమోదుచేసినట్లు తహసీల్దార్ నరసింహమూర్తి తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

గరుగుబిల్లి: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు డిమాండ్‌చేశారు. బుధవారం గరుగుబిల్లిలో ఉపాధి పథకం యూనియన్ ప్రతినిధులు అల్లు అశోక్‌కుమార్, ఎన్.ఆదినారాయణ,ఎన్.సూర్యనారాయణ, జి.వెంకటనాయుడు మాట్లాడారు. పలు సమస్యలతో సతమతమవుతున్నా ఉన్నతాధికారులు పరిష్కారానికి చొరవచూపలేదని వాపోయారు. సీఐటీయూ పిలుపు మేరకు శుక్రవారం చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

టీడీపీ నాయకుడు లక్ష్మన్నాయుడు మృతి

గరుగుబిల్లి: కొంకడివరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పెద్దింటి లక్ష్మన్నాయుడు బుధవారం మృతిచెందారు. లక్ష్మన్నాయుడు దివంగత ఎన్టీ రామారావుకు వీరాభిమాని.ఆయన మృతిపై సర్పంచ్ అల్లు అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ పురుషోత్తంనాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు ఎ.మధుసూదనరావుతోపాటు పలువురు సంతాపం ప్రకటించారు.

సరిహద్దులో చెక్‌గేట్లు ఏర్పాటు: సీఐ

భామిని: ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని బత్తిలి, భామిని సరిహద్దులో చెక్‌గేట్లను ఏర్పాటు చేసినట్లు సీఐ చంద్రమౌళి తెలిపారు. బుధవారం బత్తిలి స్టేషన్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికలు సమీపిస్తుండడంతో సరిహద్దుల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్ఐ సీహెచ్ ప్రసాద్‌ను సూచించారు. బత్తిలి చెక్‌గేటును పరిశీలించారు. నేరడి, తాలాడ, కీసర, కోసలి, కొరమ తదితర గ్రామాలను సందర్శించారు. ఆయనతో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మిల్లర్లు నిబంధనలు పాటించాలి: జేసీ

గరుగుబిల్లి: మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని జేసీ రోణంకి గోవిందరావు హెచ్చరించారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి, సంతోషపురం పరిధిలోని రైస్ మిల్లులను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యం జిల్లాకు సంబంధించి 185కుపైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయామిల్లులకు కేటాయించిన ధాన్యం నిల్వలను త్వరితగతిన ఎకనాలెడ్జ్‌మెంట్ అందించాలని ఆదేశించారు. రైతులకు అసౌకర్యం కలగకుండా అన్‌లోడ్ చేయాలన్నారు. తేమశాతం పేరుతో అధికంగా కిలోలు డిమాండ్‌చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.మిల్లింగ్‌అయిన తర్వాత బియ్యం నిల్వలను మిల్లుల్లో నిల్వ చేయకుండా త్వరగా పంపించాలన్నారు. కాగా కొత్తపల్లిలో నిత్యావసర సరుకులు పంపిణీపై ప్రజల నుంచి సమాచారం సేకరించారు.ఆయన వెంట డీటీ పి.సత్యలక్ష్మికుమార్, వీఆర్వో రామకృష్ణ ఉన్నారు.

శ్వాస సంబంధ సమస్యలను గుర్తించాలి

గరుగుబిల్లి: చిన్నారులు శ్వాస సంబంధ సమస్యలకు గురికాకుండా ఉండేలా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా హెల్త్ కార్యక్రమ అధికారి డాక్టర్ తెర్లి జగన్మోహన్‌రావు సూచించారు. బుధవారం చినగుడబ, సన్యాశిరాజుపేటల్లో టీకా కార్యక్రమాన్నితనిఖీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి పువ్వల శిరీష, ఏఎన్ఎంలు రమణమ్మ, ఈశ్వరమ్మ, సీహెచ్‌వో మౌనిక, ఇంద్రాణి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

● నందివానివలస నిర్వాసిత కాలనీలో ఆర్డీవో హేమలత పరిశీలన



నందివానివలస నిర్వాసిత కాలనీని పరిశీలిస్తున్న హేమలత

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టులో ముంపునకు గురైన నిర్వాసిత గ్రామాల్లోని నిర్వాసితుల సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని పార్వతీపురం ఆర్డీవో కె.హేమలత తెలిపారు.బుధవారం తోటపల్లి పంచాయతీ నందివానివలసలో నిర్వాసిత కాలనీలను పరిశీలించారు. సమస్యను పరిశీలించి నివేదికలు అందించాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో పూర్తిస్థాయిలో పరిశీలన చేస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ జీవీ జనార్దన్ గతంలో రాష్ట్ర పునరావాస కమిషనర్‌తో పాటు పలువురు అధికారులు నిర్వాసిత కాలనీలో సందర్శించి గ్రామసభ నిర్వహిం చారని ఆర్డీవోకు వివరించారు. గతంలో గ్రామానికి సంబంధించి బీసీ, ఎస్సీ కుటుంబాలకు పునరావాసం కల్పనకు సుమారు 26 ఎకరాల స్థలాన్ని కేటాయించారని, అయితే రెండు వర్గాలుగా విడిపోవడంతో పునరావాసానికి ఆటంకం నెలకొందని తెలిపారు. పూర్తిస్థాయిలో నివేదికలను తగుచర్యలు నిమిత్తం కలెక్టర్‌కు నివేదించడం జరుగుతుందని ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ మండంగి కృష్ణ, రీసర్వే ఉప తహసీల్దార్ ఎస్.శివున్నాయుడు, సర్వేయర్లు జి.సింహాచలం, బి.ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు మండల శంకరరావు, వీఆర్‌వో టి.రవికుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా చేరాలి

● కురుపాం, గుమ్మలక్ష్మీపురంలో అవగాహన ర్యాలీలు

కురుపాం:కురుపాంలో నీ ఓటు-నీ భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా 18 సంవత్సరలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగాచేరాలని పాలకొండ ఆర్డీవో ఎం.లావణ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బస్టాండ్ మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్, ఎన్నికలడీటీ బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.● **గుమ్మలక్ష్మీపురం:** యువత ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ జె.రాములమ్మ కోరారు. బుధవారం గుమ్మలక్ష్మీపురం నుంచి ఎల్విన్‌పేట వరకు ఓటరు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్య క్రమంలో డీటీ రాజేం ద్ర, ఆర్ఐ గిరిబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: ఓటు హక్కు వినియోగంపై వివరిస్తున్న రెవెన్యూ అధికారులు



కురుపాం: నీ ఓటు -నీ భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీవో లావణ్య

మాట మార్చిన జగన్

● పింఛన్‌దారులను వంచించినందుకు సంబరాలా

● టీడీపీ నాయకుల ధ్వజం



మాట్లాడుతున్న మధుసూదనరావు

గరుగుబిల్లి: సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని తెలుగుదేశం పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. బుధవారం నాగూరులో పార్టీ ప్రతినిధులు అక్కేన మధుసూదనరావు, ముదిలిబాబు విజయవాంకుశం విలేకరులతో మాట్లాడారు. పింఛన్‌దారులను మోసగించినందుకు సంబరాలను నిర్వహిస్తున్నారా అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తదుపరి పింఛన్లు మొత్తం పెంచుతూ పోతున్నామని జగన్ ప్రజలను మోసగించారని విమర్శించారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో అర్హత పొందిన వారికి నెలకు రూ. 2 వేలు పింఛన్ అందించినట్లు గుర్తుచేశారు. ప్రభుత్వ వైఖరి వల్ల పింఛన్‌దారుడు సుమారు రూ. 30 వేలు నష్టపోయారన్నారు. రూ. 3 వేలు పింఛన్ వస్తుందన్న ఆశతో ఎదురు చూసి పలువురు అందుకోకుండానే మృతి చెందారన్నారు. నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వ పరిస్థితిని గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ ప్రభుతాన్ని ప్రజలు చీదరించుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు తథ్యమన్నారు. సమావేశంలో రావివలస ఎంపీటీసీ సభ్యుడు కోట భరత్‌కుమార్ పాల్గొన్నారు.

పట్టణ సీఐగా జీడీ బాబు

సాలూరు: పట్టణ సీఐగా జీడీ బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ సిటీ పరిధిలోగల మల్కాపురం పోలీస్‌స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన శ్రీనివాసరావుకు విశాఖ రెంజ్‌కు బదిలీపై వెళ్లారు. కాగా సిబ్బంది జీడీ బాబును కలిసి అభినందించారు.

సాలూరు పట్టణ, రూరల్ ఎస్ఐల బదిలీ

సాలూరు రూరల్: సాలూరు పట్టణ, రూరల్ పోలీస్ ఎస్ఐలను బదిలీలు చేస్తు పార్వతీపురం ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. సాలూరు రూరల్ ఎస్ఐగా విధులను నిర్వహిస్తున్న కె.ప్రయోగమూర్తిని దిశ మహిళా సెల్‌కు బదిలీ చేశారు.సాలూరు రూరల్ ఎస్ఐగా వీఆర్‌లో ఉన్న ఎంపీ రమణను నియమించారు. సాలూరుపట్టణ పోలీస్‌స్టేషన్ ఒకటో ఎస్ఐను మక్కువకు బదిలీచేశారు. ఆయన స్థానంలో కె.వెంకట సురేష్‌ను నియమించారు. సాలూరు పట్టణ పోలీస్‌స్టేషన్ రెండో ఎస్ఐగా పనిచేస్తున్న ఎన్.భాస్కరరావును పార్వతీపురం డీఎస్‌బీకి బదిలీ చేశారు. ఆయన స్థానంలో కె. సీతారాములను నియమించారు.



సంగీత, క్రీడా పరికరాల పంపిణీ

ఒడిశా

రాయగడ: ఆదివాసీల కళాసంస్కృతుల పరిరక్షణ, అన్నిరంగాల్లో వారి అభివృద్ధేధ్యేయంగా సీఎం నవీన్ పట్నాయక్ పథకాలను ప్రవేశపెట్టి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ,మైనార్టీశాఖా మంత్రి జగన్నాథసారక తెలిపారు. రాయగడలోని బిజూఆడిటోరియంలో ప్రత్యేక అభివృద్ధి మండలి తరపున ఆదివాసీలకు వాద్యసంగీత, క్రీడాపరికరాల పంపిణీ చేశారు. మండలి అధ్యక్షురాలు అనసూయామాఝి అధ్యక్షతన జరిగిన కార్య క్రమంలో జడ్పీ అధ్యక్షురాలు సరస్వతి మాఝి,అమో ఒడిశా నవీన్ ఒడిశా సమన్వయ కర్త పట్నాన గౌరిశంకరరావు, సబ్‌కలెక్టర్ కల్యాణి సంఘమిత్ర దేవి, ఎమ్మెల్యే మకరంద ముదిలి పాల్గొన్నారు.



కళాకారులకు వాద్య పరికరాలను అందజేస్తున్న మంత్రి సారక

రాముని అక్షింతల పంపిణీ

గరుగుబిల్లి: మండలంలోని కొంకడివరం తదితర గ్రామాల్లో బుధవారం అయోధ్య రామమందిరంలోని రాముని అక్షింతలు పంపిణీ చేశారు.ఈసందర్భంగా శ్రీరామభజన సేవా మండలి ప్రతినిధులు సీహెచ్ తిరుపతిరావు, సూర్యకుమారి అక్షింతల విశిష్టతను వివరించారు. ఈ మేరకు గ్రామాల్లో భక్తులతో ఊరేగించారు. కార్యక్రమంలో కొంకడివరం సర్పంచ్ ఎ.అప్పలనాయుడు, జి.భాస్కరరావు, శ్రీరాములునాయుడు, శీర నారాయణరావు, బుచ్చయ్య, హిమాలయ, భరత్‌నాయుడు పాల్గొన్నారు.

భూ హక్కుల చట్టం రద్దు చేయాలి

సాలూరు: ప్రభుత్వం తీసుకువచ్చిన భూహక్కుల చట్టం రద్దు చేయాలని సాలూరు ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో న్యాయవాదులు బుధవారం నిరాహార దీక్ష ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరావు, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

సాలూరు: అగ్ని ప్రమాదాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సాలూరు అగ్ని మాపక అధికారి ఉప్పాడ సుధాకరరావు కోరారు. బుధవారం పట్టణంలో ఆర్సీఎం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ●**పాలకొండ:** స్థానిక గాయత్రీ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.

ఈ-పంట నమోదు పూర్తిచేయండి

సీతానగరం:రబీ సీజన్‌లో మినుము, పెసర, మొక్కజొన్న పంటలకు సంబంధించి ఈ-పంట నమోదు త్వరగా పూర్తిచేయాలని గ్రామ వ్యవసాయ సహాయ కులకు జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ ఆదేశించారు. బుధవారం సీతానగరం వ్యవసాయశాఖ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని 15మండలాల్లో ఇప్పటివరకు 1,29,012 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేశామన్నారు. జిల్లాలో మొత్తం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో ఎస్.అవినాష్ పాల్గొన్నారు.

గురుకుల క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గురుకులాల విద్యార్థులు ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి గురుకుల క్రీడల్లో సత్తాచాటారు. ఈ మేరకు ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఐటీడీఏ పీవో కల్పనాకుమారి బుధవారం అభినందించారు.బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు కబడ్డీలో ప్రథమ, 200 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ, 800 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించారు. బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు కబడ్డీలో ప్రథమ, ఖోఖోలో ద్వితీయ, 400 మీట ర్ల పరుగు పందెంలో ద్వితీయం, లాంగ్‌జంప్‌లో ప్రథమ, షాట్‌పుట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు.

● **సాలూరు రూరల్:** బొడ్డవలస బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యార్థులు పాండిచ్చేరిలో జరిగిన జాతీయ అత్యాపాత్యా పోటీల్లో ప్రతిభ చూపినట్టు ప్రిన్సిపాల్ వంగపండు శ్రీరాములు,పీడీ విద్యాసాగర్ చెప్పారు. ఈమేరకు పాఠశాలకు చెందిన నిరంజన్‌కుమార్, అశ్వంత్‌కుమార్, భవానీప్రసాద్‌లు సత్తాచాటారని తెలిపారు. ఈ మేరకు వారికి గురుకులాల జిల్లా కో ఆర్డినేటర్ పద్మజ అభినందించారు.